క్లుప్తంగా

నేడు కార్యవర్గం ఎంపిక

చౌడేపల్లి: స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మాల మహానాడు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు మాల మహానాడు అధికార ప్రతినిధి మల్లెల మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం హాజరవుతారన్నారు. ఎస్సీ వర్గీకరణపై భవిష్యత్ కార్యాచరణపై సమావేశం జరుగుతుందని తెలిపారు. కావున అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరమే!



వాలీబాల్ జట్లతో నిర్వాహకులు

పలమనేరు: విద్యార్థులకు చదువుతోపాటు మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో మేలు చేస్తాయని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి సూచించారు. ఆమేరకు స్థానిక సంఘ 89వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా స్థానిక మైదానంలో శనివారం వాలీబాల్ పోటీలను నిర్వహించారు. వీటిని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో లాగానే ప్రైవేట్ కళాశాలల్లోనూ క్రీడామైదానాలు ఉండేలా చూడాలన్నారు. ఇందులో 20 వాలీబాల్ జట్లతోపాటు బాస్ నాయకులు ఆకుల గజేంద్ర, షేక్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన పునశ్చరణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న కార్యదర్శులు, సర్పంచులు

పలమనేరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు గత మూడు రోజులుగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పునశ్చరణ తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణలో పాల్గొన్న రిసోర్స్‌పర్సన్ వీరికి గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజేష్, ఈవోఆర్డీ బాలరాజు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకే పోటీలు

పుంగనూరు: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొని దేశభక్తిని చాటేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు దేశభక్తి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. వీరికి క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రతిఒక్కరూ తప్పక పాల్గొనాలని కోరారు.

ఇంధనం పొదుపు చేయాలి



ఉద్యోగులకు చెక్ ఇస్తున్న డిపో మేనేజర్

పుంగనూరు: ఆర్టీసీ డ్రైవర్లు ఇంధనం పొదుపు చేసేలా విధులు నిర్వర్తించాలని డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. శనివారం ఆయన పుంగనూరు డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకుని ఇంధన పొదుపునకు సహకరించాలన్నారు. అత్యధికంగా ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు బాషా, ఫైరోజ్‌బాషా, కండక్టర్లు కృష్ణ, పార్వతమ్మలకు నగదు బహుమతులు అందజేశారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం



అతిథిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కుప్పంరూరల్: డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్ అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో 'నషాముక్త్ భారత్ అభిమాన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి అతిథిగా హాజరైన డా.క్రిషిత్, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ సమాజంలో డ్రగ్స్ లేకుండా చేసేందుకు యువకులు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ తీసుకోబోమని ప్రమాణం చేయించారు. రేడియోగ్రాఫర్ ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, యాంటీ డ్రగ్స్ అండ్ టొబాకో సెల్ కో–ఆర్డినేటర్ బాలాజీకుమార్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు శనివారం ఓ దాత నగదు విరాళం అందజేశారు. కర్నూలుకు చెందిన హరిషోత్తమరెడ్డి అన్నదానం ట్రస్ట్‌కు రూ.1,11,116 అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, విగ్నేష్ ఉన్నారు.

ఇంటింటికీ రేషన్ గోవిందా!

- వాహనాల్లో రేషన్ సరఫరా ఆపేసిన కూటమి ప్రభుత్వం
- ఇక చౌకదుకాణాల నుంచి సరుకులు తెచ్చుకోవాల్సిందే!
- మారుమూల గ్రామాల్లోని కార్డుదారులకు తప్పని తిప్పలు
- వాహన నిర్వాహకులకు పోయిన ఉపాధి
- ఓటేసిన పాపానికి మళ్లీ పాత కష్టాలు



పలమనేరు: పంచాయతీ కేంద్రానికి ఏడెనిమిది గ్రామాలుంటాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యావసరాల సరుకులు తీసుకోవాలంటే అక్కడి రేషన్‌షాపునకు వెళ్లాల్సిందే. దీంతో వారికి కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని 2022లో ప్రారంభించింది. కొన్ని చోట్ల మినహా ఈ పథకం చాలా బాగా సాగుతోంది. ముఖ్యంగా మారుమూల గ్రామాలు, పొలాల వద్ద కాపురాలుంటున్న కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి ఇంటి వద్దకే వాహనం వెళ్లి సరుకులను పంపిణీ చేస్తుండేది. కానీ ఈ పథకం కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతుందనే కోణంలో ఆలోచించిన కూటమి ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది. ఫలితంగా పాత కష్టాలతోనే కార్డుదారులు రేషన్ డీలర్ వద్దకెళ్లి అతనికి సమయం ఉన్నప్పుడు మాత్రమే సరుకులు పొందాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతోపాటు సంచార వాహనాల ద్వారా(ఎండీయూ) (మొబైల్ డిస్పెన్సరీ యూనిట్) ఆపరేటర్లుగా ఉన్న వారికి ఉపాధి లేకుండా చేసింది ఈ ప్రభుత్వం. రేషన్ బండ్లను రద్దు చేయడంపై పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని రేషన్ కార్డుదారులు తీవ్రంగా మండి పడుతున్నారు.

పలమనేరు రెవెన్యూ డివిజన్ వివరాలు

రేషన్ సరఫరా సంచార వాహనాలు	: 116
రేషన్ దుకాణాలు	: 411
రేషన్‌కార్డు దారులు	: 1,90,404
వాహన ఆపరేటర్లు	: 116

వాహనాల్లో ఇప్పటిదాకా సరఫరా ఇలా..

సంబంధిత రేషన్ దుకాణ పరిధిలోని కార్డుదారులకు ఇంటివద్దకే వెళ్లి నిత్యావసరాలను పంపిణీ చేసేవారు. పీడీఎస్ రైస్‌కు సంబంధించి ఐసీడీఎస్(అంగన్‌వాడీలు) స్కూళ్లు, హాస్టళ్లకు సైతం ఈ వాహనాల్లోనే సరఫరా చేసేవాళ్లు. రేషన్ దుకాణమున్న గ్రామానికి ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండే ఆవాస గ్రామాల్లోని రేషన్‌కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ వాహనాల ద్వారా సరుకులు ప్రతినెలా అందేవి. దీంతో అటవీ సమీప గ్రామాలు, వ్యవసాయ పొలాల వద్ద నివాసాలుండే వారికి ఎంతో సౌకర్యంగా ఉండేది. కూటమి ప్రభుత్వం సంచార వాహనాలను రద్దు చేయడంతో మళ్లీ పాత కష్టాలు తప్పవనే మాట జనంలో వినిపిస్తోంది.

రేషన్ డీలర్ల నిర్లక్ష్యం మళ్లీ తప్పదా..?

గతంలో రేషన్‌షాపు డీలర్లు సకాలంలో కార్డుదారులు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ఈ వ్యవస్థపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. కొందరు డీలర్లు అందుబాటులో ఉండక లబ్ధిదారులకు కష్టాలు తప్పలేదు. మళ్లీ వీరికే పంపిణీ ఇవ్వడంతో మళ్లీ అలాంటి ఇబ్బందులు తప్పవని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికితోడు కూటమి అధికారంలోకి వచ్చాక ఆపార్టీకి చెందిన డీలర్ల పెత్తనం ఉంటుందని కార్డుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మూడు కిలోమీటర్లు వెళ్లాలి



మా కుటుంబం పొలాల వద్ద కాపురం ఉంటున్నాం. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి వాహనంలో నిత్యావసరాలను అందిస్తున్నారు. దీంతో మాకు చాలా సౌకర్యంగా ఉంది. ఇది కాదని మళ్లీరేషన్ షాపునకు పోవాలంటే అంత దూరంపోయి ఇబ్బందులు పడి రేషన్ రెచ్చుకోవడం మాకు ఇబ్బంది కాదా?

- సంధ్య, కార్డుదారు, నడిమిదొడ్డిపల్లి, పలమనేరు మండలం

వారు ఆడిందల్లా ఆటగా ఉంది..



మా ఇండ్లకాడికే బియ్యం బండి వస్తాఉండె. ఐదు నిమిషాల్లో రేషన్ తీసుకొనేవాళ్లం. ఇప్పుడు బండి లేదంట, డీలర్ దగ్గరకు పోవాల. ఆయప్ప ఎప్పుడు షాపు తెరుస్తాడో లేదో తెలియదు. పోయినా గంటలకొద్దీ క్యూలో ఉండాల. ఏదో సేద్యం పనులు చేసుకునేవాళ్లకి ఇబ్బందే కదా.

- సావిత్రమ్మ, డెయిరీ దొడ్డిపల్లి, పలమనేరు మండలం

దీన్ని నమ్ముకొని ఉంటి..



గత ప్రభుత్వం నుంచి వాహన ఆపరేటర్‌గా నిత్యావసరాలను అందిస్తూ ప్రభుత్వం అందించే వేతనంతో కుటుంబాన్ని పోషించుకొనేవాడిని. ఇకపై సంచార వాహనాలు లేవని న్యూస్‌లో చూశా. ఉన్న పనిపోయింది. మళ్లీ ఇప్పుడు పనికోసం వెతుక్కోవాల. దీన్నే నమ్ముకుని ఉన్న మాలాంటి వాళ్ల బాధలు ఈ ప్రభుత్వానికి అర్థం కావా అంటున్నా. **- బాబు, వాహన ఆపరేటర్, నక్కపల్లి**

ఇబ్బందని తెలిసీ ఇలా చేస్తే ఎట్లా



ఇళ్ల వద్దకొచ్చి రేషన్ ఇవ్వడం మాకు సౌకర్యంగా ఉండింది. ఇప్పుడు రేషన్‌షాపునకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. వాటిని మాలాంటి మహిళలు మోసుకొచ్చేకి అవుతుందా. దీనికోసం ఇంటిలో మగోళ్లను పిలుచుకొని వెళ్లాలి. గవర్నమెంటు వద్ద డబ్బు లేదని ఇలా పథకాలను తీసేయడం కరెక్ట్‌కాదు.

- శశికళ, వి.కోట

ఏపీ అంటే బాబుకు అమరావతి.. పోలవరమే!

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

కుప్పం: 'దేశ వ్యాప్తంగా ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్ అంటారు.. కానీ చంద్రబాబు మాత్రం ఏపీ అంటే అమరావతి.. పోలవరమని పొద్దున్నుంచి రాత్రి వరకు జపం చేస్తుంటారు' అని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ధ్వజమెత్తారు. శనివారం కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి, పోలవరంపై చంద్రబాబు దృష్టి పెట్టారని తెలిపారు. కుప్పం 40 ఏళ్లుగా ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందని విమర్శించారు. పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నారని, కుప్పం రైల్వేస్టేషన్‌కు వెళ్లి చూస్తే వేల సంఖ్యలో ప్రజలు నిత్యం పొరుగు రాష్ట్రాలకు వెళ్లి కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కుప్పంలో పేదరికం ఇప్పటికీ అలాగే ఉందని, తిరుపతి, కుప్పం అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి పెట్టాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీ పోలవరం ఖర్చు వివరాలు బయట పెట్టాలి అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బుద్ధదేవ్ మృతి తీరనిలోటు



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పలమనేరు: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ బట్టాచార్య మృతి దేశంలోని వామపక్ష ఉద్యమానికి తీరని లోటని స్థానిక సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు పేర్కొన్నారు. ఆమేరకు స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మూడు దశాబ్దాల పాటు కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన సేవలను దేశం ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఇందులో ఆపార్టీ నేతలు ఈశ్వర్, భువనేశ్వరి, సంజయ్ పాల్గొన్నారు.

14న మండల మీట్

సదుం: మండల పరిషత్ సాధారణ సమావేశాన్ని ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్ బాబు శనివారం తెలిపారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. అధికారులు తమ శాఖ నివేదికలతో తప్పక హాజరుకావాలని కోరారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐరాల: ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలు, సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా సీనియర్ యూటీఎఫ్ నాయకుడు కృష్ణారెడ్డి, నాయకులతో కలిసి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటాలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏకాంబరం, మండల గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కూటమికి సూపర్ గండం

- సూపర్‌బజార్ డైరెక్టర్లలో జనసేన, బీజేపీకి దక్కని చోటు
- మైనారిటీలు, ఎస్సీలను కరివేపాకుగా వాడుకుంటున్న వైనం
- ఏఎంసీ చైర్మన్ గిరిపై జనసేన, బీజేపీ, ఎస్సీ నేతల కన్ను
- తమకు తగిన ప్రాధాన్యత దక్కలేదని మదనపడుతున్న వైనం



పలమనేరు సూపర్‌బజార్

పలమనేరు: తాజాగా కూటమి ప్రభుత్వం పలమనేరు సహకార సూపర్‌బజార్‌కు పార్టీ ఇన్‌పర్సన్‌తో పాటు పది మంది డైరెక్టర్లను నియమించింది. వీరిలో జనసేన, బీజేపీలకు స్థానం లేకుండా పోయింది. ఇదే ఇప్పుడు కూటమి నేతల్లో అసంతృప్తికి కారణమైందనే మాట జోరుగా వినిపిస్తోంది. సూపర్‌బజార్‌లో స్థానం లేకుండా పోవడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టునైనా దక్కించుకోవాలనే ఆలోచనలో బీజేపీ, జనసేన నేతలున్నట్లు తెలుస్తోంది. సూపర్‌బజార్ అధ్యక్షుడిగా సుభాష్ చంద్రబోస్ 38 ఏళ్లుగా ఉన్నారు. సూపర్‌బజార్ గడువు ఈనెల తొలివారంలో ముగిసింది. దీంతో దీనికి ఎన్నికలకు నిర్వహించడానికి బదులు అధికార పార్టీ తమ అధికారంతో ఆరునెలల పాటు ఉండేలా పార్టీ ఇన్ పర్సన్‌గా బోస్ సోదరుడు, టీడీపీ నాయకుడు ఆర్వీ బాలాజీకే ఇచ్చి అదే కుటుంబానికి చెందిన వ్యక్తికి సూపర్ పగ్గాలనిచ్చారు. కనీసం డైరెక్టర్లలోనైనా తమకు స్థానం ఉంటుందని జనసేన, బీజేపీ నేతలు భావించినా ఆ ఊసే లేకుండా పోయింది. పట్టణంలో 20వేలకు పైగా ముస్లింలున్నారు. అలాగే 22వేల దాకా ఎస్సీలున్నారు. టీడీపీకి చెందిన ఈ వర్గానికి సైతం సూపర్ డైరెక్టర్ల పదవులు దక్కలేదు. దీంతో సొంత పార్టీకి చెందిన ఆ నేతలే అంతర్మథనంలో ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు కూటమిలోని సహచర పార్టీలు దీనిపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

సూపర్ దెబ్బకు ఏఎంసీ చైర్మన్‌కు పెరిగిన పోటీ!

సూపర్‌బజార్‌కు సంబంధించి అంతా టీడీపీ హవా కనిపించడంతో కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అయినా తమకు దక్కుతుందనే ఆశతో ఉన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలో అన్నీ సాఫీగానే సాగుతున్నాయనుకున్న స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డికి సైతం రాబోవు వ్యవహారాలు కత్తిమీదసాములా మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఏఎంసీ చైర్మన్ పదవికి టీడీపీకి చెందిన పదిమంది వరకూ ఇప్పటికే క్యూలో ఉన్నారు. ఆ పార్టీలోనే ఎస్సీలకు ఇవ్వాలని కొందరు, మైనారిటీలు ఎక్కువగా ఉన్నందున తమకే దక్కాలని ఆ నేతలు, టీడీపీకి వెన్నెముక లాంటి బీసీలకే చైర్మన్ పదవి దక్కాలని బీసీ నేతలు, రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని ఆదే పార్టీకి చెందిన వారు బరిలో ఉన్నారు. ఇలా ఒకే పార్టీలో నాలుగు స్తంభాలాటగా ఇలా ఉంటే..కూటమిలో భాగస్వాములైన తమకేమీ ప్రాధాన్యత లేదా? అని భాగస్వామ్య నేతలు సైతం భావిస్తున్నట్టు ఇక్కడ మారుతున్న రాజకీయ పరిణామాలు చెబుతున్నాయి. ఏదేమైనా కూటమి నేతలతో సయోధ్య చేస్తూ రాబోయే నామినేటెడ్ పోస్టులను స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎలా చేస్తారనేది వేచి చూడాల్సిందే.

ఆక్రమిత స్థలంలో బోర్డులు ఏర్పాటు



ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

చౌడేపల్లి: బోయకొండ సమీపంలోని కొదమదేవర గుట్ట సమీపంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని చదును చేస్తున్న స్థలాలన్నీ ప్రభుత్వ స్థలాలుగా గుర్తించినట్లు తహసీల్దార్ హనుమంతునాయక్ తెలిపారు. రెండు రోజుల క్రితం బోయకొండలో భూ దందా అనే శీర్షికన సాక్షి పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన అధికారులు రెండు రోజులపాటు సర్వే నిర్వహించి ఆక్రమిత స్థలం ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. శనివారం వీఆర్వో రాజన్న, సిబ్బందితో కలసి ఆస్థలంలో బోర్డులు ఏర్పాటుచేశారు. సర్వే నంబర్ 190,191 నంబర్లలో ప్రభుత్వ భూమి కలదని ఈ స్థలాల్లోకి ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరికలు చేస్తూ ఏర్పాటుచేశామని తెలిపారు. నిబంధనలు పాటించకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి యత్నిస్తే వారిపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరికలు చేశారు.

శరవేగంగా విగ్రహ ఏర్పాటు పనులు



విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న రమణారెడ్డి

చౌడేపల్లి: మండలంలోని ఏ.కొత్తకోట సమీపంలో ఏర్పాటు చేస్తున్న పంచముఖ హనుమద్దీశ్వరుడి విగ్రహ పనులు శరవేగంగా సాగుతున్నాయి. శనివారం పనులను బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు ఎస్‌కే రమణారెడ్డి, రతీదేవి పరిశీలించారు. వారి ఆధ్వర్యంలో రూ.30 కోట్లతో మూడెకరాల స్థలంలో 60 అడుగుల ఎత్తైన పంచముఖ విగ్రహం, లక్ష్మీదేవి, గణపతిదేవి, కల్యాణ వెంకటరమణస్వామి, సూర్యదేవాలయం, షిరిడీ సాయిబాబా, వినాయకస్వామి, అయ్యప్పస్వామి ఆలయం, కల్యాణ మండపం, జోతిర్లింగాల ఏర్పాటుకు పనులన్నీ జరుగుతున్నాయి. వివిధ దశల్లో జరుగుతున్న పనులను ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలసి సందర్శించారు. మండల ప్రజల సౌకర్యార్థం అన్ని దేవాలయాలు ఒకే చోట ఉండేలా మాస్టర్ ప్లాన్ మేరకు రూపొందించినట్లు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నట్లు రమణారెడ్డి తెలిపారు. ఆయన వెంట నేత మనోహర్ ఉన్నారు.

తొయ్యండయ్యా బాబు..తొయ్యండి



కుప్పం–క్రిష్ణగిరి బస్సును తోస్తున్న ప్రయాణికులు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- సీఎం నియోజకవర్గంలో దయనీయంగా ఆర్టీసీ పరిస్థితి

కుప్పంరూరల్: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట మధ్యలో ఆగిపోయి ప్రయాణికులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. తాము అధికారంలోకి వచ్చిన నెలకే ఆర్టీసీ పరిస్థితిలో మార్పులు తెస్తామన్న చంద్రబాబు మాటలు నీటిపై రాతలుగా మారాయి. అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా, తన సొంత నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సుల పరిస్థితి మారడం లేదు. ఒకటి, రెండు కొత్త బస్సులు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఉన్న బస్సుల స్థితిగతులు పట్టించుకోవడం లేదు. శనివారం ఉదయం బస్టాండు ఆవరణలోనే అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసు కుప్పం–క్రిష్ణగిరి బస్సు స్టార్ట్ అయ్యేందుకు మొరాయించడంతో ప్రయాణికులు కిందికి వచ్చి బస్సులు తోయాల్సి వచ్చింది. నిత్యం ఏదో ఒక చోట బస్సులు మొరాయించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందుల నడుమ ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుప్పం డిపోలోని బస్సులకు మరమ్మతులు చేయాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థులకు వైద్యపరీక్షలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

పుంగనూరు: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌లోని విద్యార్థులకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా హాస్టల్ ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు హరిప్రసాద్‌రెడ్డి, దేవప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అబార్షన్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం

- డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అబార్షన్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో శనివారం కడుపులోనే చిదిమేస్తున్నారు..అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. జిల్లాలో జరుగుతున్న అబార్షన్లు, ఇతరత్రా వివరాలపై ఆరా తీశారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ స్పందిస్తూ డెకాయి ఆపరేషన్లను మరింత వేగవంతం చేస్తామన్నారు. ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేయడంతో పాటు సీజ్ చేస్తామన్నారు. స్కానింగ్ యంత్రాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద తనిఖీ చేసేందుకు రవాణా, పోలీసు శాఖ దృష్టికి తీసుకెళ్లామన్నారు. లింగనిర్ధారణకు పాల్పడితే పీసీపీఎన్‌డీటీ చట్ట ప్రకారం జరిమానాతోపాటు కేసులు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అబార్షన్లు చేయాలని ఆమె పేర్కొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

తవణంపల్లె: విజయవాడ నడ్డిబొడ్డున ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో దళిత యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘ నాయకులు పాలాభిషేకం చేసి, గజమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధ్వంసానికి పాల్పడిన వారిని ప్రభుత్వం గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతే దళితలంతా ఏకతాటిపైకి వచ్చి ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని విధ్వంసానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. దళిత సంఘ నాయకులు మురగన్, జగన్నాథం, షణ్ముగం, పరదేశి, మధుకుమార్, రీటాబాబు, ఏకరాజ్, మునేంద్ర, మణిరాజ్, అనంత్‌కుమార్, గోవిందు పాల్గొన్నారు.